క్లుప్తంగా

మహిళలకు కుట్టుమెషీన్ల పంపిణీ



కుట్టుమెషీన్లు అందజేస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో మహిళలకు నాలుగు కుట్టు మెషీన్లు పంపిణీ చేశారు. జేఎస్ రోడ్డులోని ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్లో శనివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు నాళం నరసింహారావు మాట్లాడుతూ అమెరికాలో ఉంటున్న రాయల్ రెడ్డి సౌజన్యంతో తన తండ్రి ద్వారంపూడి దత్తాత్రేయ, తల్లి సుబ్బాయమ్మ, తమ్ముడు రాఘవేంద్రల జ్ఞాపకార్థం అందజేసినట్టు తెలిపారు. అలాగే రోటరీ రివర్ సిటీ ట్రెజరర్ నూలి శివమల్లికార్జున్ సౌజన్యంతో బీటెక్ విద్యార్థినికి రూ.25 వేలను విద్యా ప్రోత్సాహకంగా అందజేశారు.

అన్న సమారాధనలు

కడియం: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపులో భాగంగా మండలంలోని పలు చోట్ల శనివారం భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. బుర్రిలంకలోని లక్ష్మీరత్న గణపతిస్వామి ఆలయం వద్ద దాతలు, భక్తుల సహకారంతో అన్నదానం చేశారు. కడియంలోని సుబ్బారావుపేటలో అన్నదానం నిర్వహించారు. ఎంపీపీ వెలుగుబంటి సత్య ప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల వీర్రాజు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక యువత ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పౌష్టికాహారం పంపిణీ

కడియం: గర్భిణులు, బాలింతలు తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తమ ఆరోగ్యంతో పాటు, బిడ్డల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని వక్తలు అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ఐసీడీఎస్ సీడీపీవో టి.కనకవల్లి ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లకు రాహుల్ గాంధీ వ్యతిరేకి



నిరసన తెలుపుతున్న సోము వీర్రాజు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: దేశంలోని రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ధ్వజమెత్తారు. ఆ వ్యాఖ్యలను నిరసిస్తూ శనివారం క్వారీ సెంటర్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కాలెపు సత్యసాయిరామ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సోము వీర్రాజు మాట్లాడుతూ వాషింగ్టన్ జార్జి టౌన్ విశ్వవిద్యాలయంలోని విద్యార్థులతో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లోనూ భారత్‌లో రిజర్వేషన్లు రద్దు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ వస్తే రిజర్వేషన్లు తీసేస్తామన్న ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందన్నారు. ఈ విషయాన్ని దేశ ప్రజలందరూ గమనిస్తున్నారని, వారే రాహుల్ గాంధీకి, కాంగ్రెస్‌కుతగిన బుద్ధి చెబుతారన్నారు. నిరసనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణ, కురగంటి సతీష్ పాల్గొన్నారు.

నోడల్ అధికారులకు శిక్షణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో శనివారం హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (హెచ్‌ఎంఐఎస్) నోడల్ అధికారులకు హెచ్ఎంఐఎస్ వెరిఫికేషన్ యాప్‌పై శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.సంధ్య, ఎస్‌వో జె.కుమారస్వామి, డీఎస్‌వో సీహెచ్ బాస్కర్, గణాంకాధికారి బి.జానకి తెలిపారు.

ఆధ్యాత్మిక ఉత్సవాలతో ఐక్యత



అన్న ప్రసాదం వడ్డిస్తున్న ఆకుల వీర్రాజు

రాజమహేంద్రవరం సిటీ: మెయిన్ రోడ్డులోని కందుకూరి వీరేశలింగం పురమందిరం సమీపంలో సిద్ధి వినాయక వినాయక మహోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీసీసీబీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు ఆకుల వీర్రాజు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక ఉత్సవాలతో ఐక్యత పెరుగుతుందన్నారు. కార్యక్రమం వేంకటేశ్వర మార్కెట్ జనరల్ మార్కెట్ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు నందెపు శ్రీనివాస్, ది రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షులు ఒంటెద్దు సూరిబాబు, ఆకుల శ్రీనివాస్, చాంబర్ డైరెక్టర్ వలవల దుర్గాప్రసాద్, సిద్ధి వినాయక మహోత్సవ కమిటీ సభ్యులు బిసా భాస్కర్ రెడ్డి, గట్టి ప్రభు, నక్కా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బయటి నుంచే రైట్ రైట్..

- ధవళేశ్వరం బస్టాండ్ లోపలకు రాని ఆర్టీసీ బస్సులు
- ఎండలోనే ప్రయాణికుల నిరీక్షణ



ధవళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ప్రైవేటు వాహనాల పార్కింగ్



బస్టాండ్‌లోకి రాకుండా బయట నుంచే వెళ్లిపోతున్న బస్సు

ధవళేశ్వరం: చాలా గ్రామాల్లో బస్టాండ్ లేక ప్రయాణికులు ఇబ్బంది పడతారు. తాము ఎక్కాల్సిన బస్సు వచ్చే వరకూ ఎండలోనో, చెట్ల కిందో నిరీక్షిస్తారు. చివరకు బస్సు రాగానే హమ్మయ్య అని ఊపిరి పీల్చుకుని బస్సు ఎక్కి తమ గమ్యస్థానాలకు చేరుకుంటారు. కానీ బస్టాండ్ ఉన్నా బస్సుల కోసం ఎండలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడితే చాలా కష్టంగా ఉంది. అది కూడా ఏ మూరుమూల ప్రాంతంలో కాకుండా జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంటే.. ఆ బాధలు వర్ణనాతీతం. సరిగ్గా ధవళేశ్వరం ప్రజలు ఈ పరిస్థితిలోనే ఉన్నారు. బస్టాండ్ ఉన్నా దానిలోకి బస్సులు రావపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

పేరుకు బస్టాండ్

ధవళేశ్వరంలో బస్టాండ్ ఉంది. కానీ అది ప్రయాణికులకు కాకుండా ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఉపయోగపడుతోంది. ఎవరైనా బస్సు ఎక్కేందుకు పొరపాటున దానిలో వేచి ఉంటే రోజు గడుస్తుంది తప్ప బస్సు మాత్రం రాదు. కానీ బస్సు ఎక్కాలంటే రోడ్డు మీద ఎండలో నిలబడాలి. రాజమహేంద్రవరం మహా నగరానికి అనుకొని ఉన్న మేజర్ గ్రామ పంచాయతీ ధవళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ పరిస్థితి ఇది.

ఆందోళనలు చేసినా..

ఈ సమస్యపై గ్రామస్తులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు అనేక సార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. అయిన ఫలితం మాత్రం శూన్యం. గతంలో ధవళేశ్వరం వాసులు రోడ్డెక్కి ఆందోళన చేస్తే ఒక నెల రోజులు బస్సులు బస్టాండ్‌లోకి వచ్చాయి. తరువాత పరిస్థితి షరా మామూలే. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే వేచి ఉండాల్సి వస్తుంది.

60 వేల మంది జనాభా

సుమారు 60 వేల మంది జనాభా కలిగిన ధవళేశ్వరంలో రోజూ వేల మంది ఆర్టీసీ బస్సుల ద్వారా రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లోకి బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ఎండలోనే రోడ్డుపై నిలబడాల్సి వస్తోంది. ఆర్టీసీ అధికారులు దృష్టి సారించి బస్సులు లోపలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గతంలో ఆర్టీసీ సిబ్బంది ఒకరు బస్టాండ్‌లో ఉండేవారు. లోపలకు వచ్చి వెళ్లే బస్సుల వివరాలను నమోదు చేసేవారు. ప్రస్తుతం అక్కడ సిబ్బంది ఎవ్వరూ లేక పోవడంతో ధవళేశ్వరం ఆర్టీసీ బస్టాండ్ అలంకార ప్రాయంగా మారింది.

ప్రైవేట్ వాహనాల స్టాండ్

ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంతో బస్టాండ్‌ను ప్రైవేట్ వాహనాల పార్కింగ్‌కు ఉపయోగించుకుంటున్నారు. దీంతో గ్రామంలో బస్టాండ్ ఉన్నా అది అలంకారప్రాయంగా మారింది. ప్రతి రోజూ సుమారు 2 వేల మంది ఆర్టీసీ బస్సుల్లో గ్రామం నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లోకి వాహనాలు రాకపోవడంతో వీరంతా రోడ్లపైనే వేచి ఉంటున్నారు. మరో పక్క మార్కెట్ సెంటర్‌లో రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఆర్టీసీ బస్సులను రోడ్లపై ఆపే సమయంలో ట్రాఫిక్ పెద్ద ఎత్తున నిలిచిపోతుంది. దీంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ట్రాఫిక్ తరచూ నిలిచిపోవడం పరిపాటిగా మారింది.

3 నుంచి దేవీచౌక్‌లో దసరా ఉత్సవాలు



దేవీచౌక్ ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాజరాజేశ్వరరావు తదితరులు

సీటీఆర్ఐ: దేవీచౌక్‌లోని బాలా త్రిపుర సుందరి అమ్మవారి దసరా ఉత్సవాల సందర్భంగా అక్టోబర్ 2వ తేదీ రాత్రి 9.09 గంటలకు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని శ్రీదేవి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బత్తుల రాజరాజేశ్వరరావు తెలిపారు. దేవీచౌక్‌లోని అమ్మవారి కల్యాణ మండపంలో శనివారం సమావేశం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరరావు మాట్లాడుతూ 3వ తేదీ నుంచి దసరా ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 6న దంపతుల పూజ, 20న అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. తొలిరోజు స్వర్ణ కవచ కనకదుర్గాదేవిగా, రెండో రోజు గాయత్రిగా, మూడో రోజు అన్నపూర్ణాదేవిగా, నాలుగో రోజు మహాలక్ష్మీదేవిగా, ఐదోరోజు బాలా త్రిపుర సుందరీదేవిగా, ఆరో రోజు లలితా త్రిపుర సుందరిగా, ఏడో రోజు సరస్వతిగా, ఎనిమిదో రోజు దుర్గాదేవిగా, తొమ్మిదో రోజు మహిషాసుర మర్దిని, పదో రోజు రాజ రాజేశ్వరిగా అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ రాత్రి 10 గంటలకు నాటకాలు ప్రారంభమవుతాయన్నారు. సమావేశంలో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు ముత్యాల కుమార్ రెడ్డి, గంధం భైరవస్వామి, ఆకుల వెంకటేశ్వరరావు, సెక్రటరీ అల్లక సత్యనారాయణ, కోశాధికారి బత్తుల ఈశ్వరరావు, సహాయ కార్యదర్శి పిల్లా వెంకటేశ్వరరావు, మాది రెడ్డి చంద్రశేఖర నరసింహారావు పాల్గొన్నారు.

2న రాజమహేంద్రవరంలో ఖాదీ శారీ వాక్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న రాజమహేంద్రవరంలో ఖాదీశారీ వాక్ నిర్వహిస్తున్నట్టు ఆ కార్యక్రమ సమన్వయకర్త జక్కంపూడి విజయలక్ష్మి తెలిపారు. ఆ కార్యక్రమ పోస్టర్‌ను శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ స్వదేశీ వస్తువుల్ని ప్రోత్సహించడంలో భాగంగా గాంధీజీ ఇచ్చిన పిలుపుతో ఖాదీ స్వదేశీ ఉద్యమం వెలుగు చూసిందన్నారు. ఆయన జయంతి రోజు ఆంధ్ర కేసరి యువజన సమితి ఆధ్వర్యంలో ఖాదీశారీ వాక్ నిర్వహిస్తామన్నారు. ఖద్దరు చీరలు ధరించిన వందల మంది మహిళలు ఆ రోజు స్వాతంత్ర్య సమర యోధుల పార్కు నుంచి సరస్వతీ ఘాట్‌లోని భారతమాత విగ్రహం వరకు ప్రదర్శన చేస్తారన్నారు. కార్యక్రమానికి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, కలెక్టర్ పి.ప్రశాంతి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు, కార్యదర్శి శ్రీనివాస్, బర్ల సీతారత్నం పాల్గొన్నారు.

ఈనిక దశలో ఖరీఫ్ వరి పంట



వరి పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజమహేంద్రవరం రూరల్: మండలంలో సార్వా వరి ప్రస్తుతం ఈనిక దశకు దగ్గరలో ఉందని, పంట ఆరోగ్యంగానే ఉందని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఆయన శనివారం తొర్రేడు గ్రామంలోని వరి పొలాలను శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో ఎండాకు తెగులు కనిపించిందన్నారు. ఆ ప్రాంతాల్లో నత్రజని ఎరువు ఆపివేసి, మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 20 కిలోలు చల్లుకోవాలన్నారు. అక్కడక్కడా కనిపిస్తున్న సుడిదోమ నివారణకు అసిఫేట్ 1.5 గ్రాములు, లేదా ట్రైఫ్లూమీజోపెరిమ్ 0.4 గ్రాములను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివా, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి భీమరాజు, ఏఈవో పీటర్ జాన్, వీఏఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యాపారం నుంచి రుణాల వరకూ సాయం



సమావేశంలో పాల్గొన్న సిడ్బీ జీఎం చంద్రమౌళి తదితరులు

సీటీఆర్ఐ: సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపించే వారికి ప్రోత్సాహం అందిస్తే, వారు మరింత రాణిస్తారని స్మాల్ ఇండస్ట్రియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్ఐడీబీఐ) జనరల్ మేనేజర్ వి.చంద్రమౌళి అన్నారు. స్థానిక ఆనంద్ రీజెన్సీ హోటల్లో శనివారం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, క్లస్టర్ సంఘాల పారిశ్రామిక వేత్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిడ్బీ ద్వారా చిన్న తరహా పారిశ్రామిక వేత్తలకు అనేక విధాలుగా సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. వ్యాపారం నుంచి రుణాల వరకూ సాయం చేయడానికి క్లస్టర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరికి సంబంధించి కాకినాడలో క్లస్టర్ బ్రాంచ్ ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారన్నారు. కొందరు సంఘాలుగా ఏర్పడి వ్యాపారాలు నిర్వహిస్తూ, బ్యాంక్ నుంచి రూ.కోటి వరకూ సబ్సిడీతో కూడిన రుణం తీసుకుంటున్నారన్నారు.

డిమాండ్లు నెరవేర్చే వరకూ ఆందోళన



డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పీహెచ్‌సీల వైద్యులు

రాజమహేంద్రవరం రూరల్: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చేవరకూ ఆందోళన విరమించేది లేదని పీహెచ్‌సీ వైద్యులు స్పష్టం చేశారు. బొమ్మూరులోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం వద్ద శనివారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పీహెచ్‌సీ వైద్యుల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ మౌనిక, కార్యదర్శి డాక్టర్ వినూత్న, కోశాధికారి డాక్టర్ ధర్మరాజు మాట్లాడుతూ వైద్యులకు పీజీ కోర్సుల్లో ఇన్ సర్వీసెస్ కోటా సీట్లు తగ్గించడాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టామన్నారు. రెండు సార్లు విస్తృతంగా చర్చలు జరిపినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాలేదన్నారు. జీవో నంబర్ 85ను రద్దు చేసేవరకూ తమ ఆందోళన కొనసాగుతుందన్నారు. ఇన్ సర్వీస్ కోటా కుదింపుతో తూర్పుగోదావరి జిల్లాలో 108 మంది పీహెచ్‌సీ వైద్యులు, రాష్ట్ర వ్యాప్తంగా 2,560 మంది వైద్యులు నష్టపోతున్నారన్నారు. పీహెచ్‌సీ వైద్యులందరూ ఆదివారం విధులను బహిష్కరించడం జరుగుతుందని, అలాగే ఈ నెల 23వ తేదీ నుంచి విజయవాడలోనే ఆందోళన చేపడతామన్నారు. అనంతరం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఎస్.సంధ్యకు వినతిపత్రం అందజేశారు.


స్వర్ణాంధ్ర రాంబాబు సేవలు అభినందనీయం



గుబ్బల రాంబాబు దంపతులను సత్కరిస్తున్న ఎల్ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: జీవిత బీమా సంస్థ ఉద్యోగిగానే కాకుండా జర్నలిస్టుగా, స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడిగా డాక్టర్ గుబ్బల రాంబాబు సమాజానికి అందించిన అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక మోడల్ కాలనీలోని భారతీయ జీవిత బీమా ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం జనరల్ బాడీ సమావేశంలో ఉద్యోగ సంఘం తరపున ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జీవిత బీమా సంస్థ రాజమహేంద్రవరం డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి, విశ్రాంత సేల్స్ మేనేజర్ శేషయ్య, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు, ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు పి.సతీష్, జోనల్ సెక్రటరీ రవీంద్రనాథ్, ఐసియూ ప్రధాన కార్యదర్శి కోదండరామ్, నగర ప్రముఖులు తుమ్మిడి అరుణకుమార్, బామ్‌సెఫ్ మాజీ జాతీయ అధ్యక్షులు నయనాల కృష్ణారావు మాట్లాడారు. రాంబాబు జీవిత బీమా సంస్థ ఉద్యోగిగా అంకితభావంతో 33 ఏళ్ల పాటు సేవలు అందించారన్నారు. స్వర్ణాంధ్ర సంస్థ ద్వారా మూడు దశాబ్దాలకు పైగా సేవలు అందిస్తున్నారన్నారు. ఆయనకు ఇంకా సర్వీసు ఉన్నప్పటికీ సేవా రంగానికి పూర్తిగా అంకితం కావాలన్న ఉద్దేశంతో స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారన్నారు. ఈ సందర్భంగా గుబ్బల రాంబాబు మాట్లాడుతూ సమాజం కోసం పనిచేసిన వ్యక్తిని సమాజం గుర్తిస్తుందనేందుకు తన జీవితమే ఉదాహరణ అన్నారు. అనంతరం రాంబాబు, బేబి దంపతులను ఘనంగా సత్కరించారు.

జేసీకి రేషన్ డీలర్ల వినతి



జేసీ చిన్నరాముడికి వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్లు

రాజమహేంద్రవరం సిటీ: రేషన్ షాపునకు కార్డులను తగ్గిండం వల్ల తమకు నెలకు వచ్చే పారితోషికం తగ్గిపోతోందని, దీనిపై అధికారులు దృష్టి సారించి ఇబ్బందిలేని నిర్ణయం తీసుకోవాలని జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు జామి కృష్ణ అన్నారు. ఈ మేరకు జేసీ చిన్నరాముడుకి శనివారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ షాపు ఒక్కంటికి ఎనిమిది వందల కార్డులకు తగ్గకుండా కార్డులు అందరికీ సమానంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్పొరేషన్ పరిధిలో షాపు అద్దె, కరెంటు చార్జీలు, కుటుంబ పోషణ దృష్టిలో పెట్టుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

పరిశుభ్రత మనందరి సామాజిక బాధ్యత



స్వచ్ఛతాహి ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమహేంద్రవరం రూరల్: పరిశుభ్రత పాటించడం మనందరి సామాజిక బాధ్యత అని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం పిడింగొయ్యి పంచాయతి పరిధిలోని ఎస్‌వీజీ మార్కెట్ నుంచి వీఎల్‌పురం వరకూ అధికారులు, విద్యార్థులు, ఎస్‌వీజీ మార్కెట్ వర్తకులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిశుభ్రతపై ప్రజల్లో అవగాహన చైతన్యం కలిగించే విధంగా ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కేఎన్ జ్యోతి, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి తులసీదాస్, పంచాయతీ కార్యదర్శి ఎం.రూప్‌చంద్, ఎస్‌వీజీ మార్కెట్ అధ్యక్ష, కార్యదర్శులు నందెపు శ్రీనివాస్, మద్దాల రవి, టీడీపీ జిల్లా కార్యదర్శి మార్ని వాసుదేవ్ పాల్గొన్నారు.

శాటిలైట్‌సిటీని మరింత అభివృద్ధి చేస్తా...

తన దత్తత గ్రామమైన శాటిలైట్ సిటీని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. ఆ గ్రామంలోని జక్కంపూడి రామ్మోహన రావు కళ్యాణ మండపంలో శనివారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు.

గురజాడ గొప్ప సంఘ సంస్కర్త



కడియం హైస్కూల్లో బడితోటను ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కడియం: గురజాడ అప్పారావు గొప్ప సంఘ సంస్కర్త అని స్థానిక హైస్కూల్ హెచ్ఎం టి.సత్యనారాయణ అన్నారు. గురజాడ జయంతిని పురస్కరించుకుని స్కూల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గురజాడ రచనల గురించి తెలిపారు. ఆ మహాకవి జయంతిని పురస్కరించుకుని మునగ, గోంగూర, తోటకూర విత్తనాలు చల్లి, బడితోటను ప్రారంభించారు. గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో తోటను నిర్వహిస్తామన్నారు.



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుబ్బలక్ష్మి తదితరులు

ఆధునిక స్త్రీ ప్రతినిధి గురజాడ

సీటీఆర్ఐ: గురజాడ రచనల్లోని కమలిని, కన్యక, పూర్ణమ్మ, వెంకమ్మ, మీనాక్షి, బుచ్చమ్మ లాంటి స్త్రీ పాత్రలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పితృస్వామిక ఆధిపత్యాన్ని నిరసించినవేనని ఆర్ట్స్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సుబ్బలక్ష్మి అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో శనివారం గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సభకు డాక్టర్ పీవీబీ సంజీవ రావు అధ్యక్షత వహించారు.

నేడు మానవత సమావేశం

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక మానవత సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం 8.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు పాల కృష్ణ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆయన శనివారం మాట్లాడుతూ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై చర్చ నిర్వహిస్తామన్నారు. సంస్థ సభ్యులందరూ తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

పర్యావరణంపై బాధ్యతగా మెలగాలి



పర్యావరణంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

రాజమహేంద్రవరం రూరల్: ప్రతి విద్యార్థి పర్యావరణంపై బాధ్యతతో మెలగాలని రాజమహేంద్రవరం ప్రభుత్వ కళాశాల (స్వయంప్రతిపత్తి) ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే అన్నారు. ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు దత్తత గ్రామాలైన హుకుంపేట, కోలమూరు, కాతేరులో ర్యాలీలు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రాబోయే తరాల కోసం పర్యావరణాన్ని కాపాడటం అందరి బాధ్యత అన్నారు. విద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రోగ్రాం కో ఆర్డినేటర్ బి.మల్లికార్జున, బి.భవాని, కె.సుభాషిణీ దేవి పాల్గొన్నారు.

26న విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఆదిత్య డిగ్రీ కాలేజీలో ఈ నెల 26వ తేదీ ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక జరుగుతుందని ఎస్ఈ కె.తిలక్ కుమార్, ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆ కార్యక్రమం వివరాలు వెల్లడించారు. సీజీఆర్ఎఫ్ చైర్మన్, విశ్రాంత జడ్జి బి.సత్యనారాయణ, కమిటీ సభ్యులు వి.జనార్దన రావు, ఎస్.హరిబాబు, ఆర్.సురేంద్రకుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తారన్నారు. అనంతరం 12 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకూ వేంకటేశ్వరా ఆనం కళాకేంద్రం ఎదురుగా కార్పొరేషన్ ప్రాంగణంలో ఉన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం టౌన్–1లో విద్యుత్ సమస్యల ఫిర్యాదులను స్వీకరిస్తారన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ వేదికలో పాల్గొని తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేయాలని కోరారు.

ముమ్మరంగా తనిఖీలు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: నగరంలోని ఆహార విక్రయ, తయారీ కేంద్రాలను ముమ్మరంగా తనిఖీలు చేయాలని ఫుడ్ కమిటీ సభ్యులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. నగరపాలక సంస్థలో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మూడు ఫుడ్ కమిటీల ప్రగతిని సమీక్షించారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆహారం తయారీ, విక్రయ కేంద్రాల నిర్వాహకులు పరిశుభ్రమైన తాజా ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు. సమావేశంలో ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వినూత్న, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వి.రుక్మయ్య, శానిటరీ సూపర్ వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కట్నం వేధింపులు

సీతానగరం: సింగవరం పంచాయతీ పరిధిలోని నాగరత్నం కాలనీకి చెందిన మిరియాల పూర్ణ విజయదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కట్నం వేధింపుల కేసు నమోదు చేశారు. ఎస్సై రామ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండపేట మండలం ద్వారపూడికి చెందిన ఏపుగంటి సాయితో విజయదుర్గకు 2022 లో వివాహమైంది. అయితే భర్త సాయితో పాటుగా అత్తమావలైన సత్యవతి, వీరన్న, ఆడపడుచు దుర్గ కట్నం కోసం విజయదుర్గ శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాలు



శ్యామల	35 చిన్నకథకాదు
సూర్యమినీ	ట్రాన్స్‌ఫార్మర్స్-1
సూర్యప్యాలెస్	శివాజీ
స్వామి	సరిపోదా శనివారం
అశోక	గొర్రె పురాణం
శివజ్యోతి	మత్తు వదలరా-2
అనుశ్రీ	మత్తు వదలరా-2
రాజా	మత్తు వదలరా-2
రంభ	హైడ్ అండ్ సీక్, కళింగ
ఊర్వశి	100 క్రోర్స్, కమిటీ కుర్రోళ్ళు
మేనక	జర్నీ, చిక్లెట్స్
కుమారి	డిమోంటీ కాలనీ-2, ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్(గోట్)
అప్సర నామవరం	సరిపోదా శనివారం
వీఎస్ మహల్ ధవళేశ్వరం	ఏఆర్ఎం
మురళీకృష్ణ కడియం	మత్తు వదలరా-2
వెంకటసూర్య	మత్తు వదలరా-2